క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

పెనుకొండ రూరల్: మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ మండలంలోని పలు గ్రామాల్లో నేడు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి కురుభవాండ్లపల్లి, హరిపురం, రాంపురం, మరువపల్లి, రాంపురం, కొండంపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీ

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను బకాయిలపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేసిందని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 లోగా ఆస్తి పన్ను బకాయిలను చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందన్నారు. ఆస్తిపన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తప్పిపోయిన యువకుడి గుర్తింపు



పెనుకొండ: తప్పిపోయిన అవినాష్ అనే యువకుడిని పోలీసులు శుక్రవారం గుర్తించారు. పట్టణానికి చెందిన అవినాష్ (18)ను బాగా చదువుకోవాలని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపంతో గత నెల 27న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అవినాష్ వీరణ్ణ కొండలో ఉన్నట్లు గుర్తించి అతనిని స్టేషన్‌కు పిలుచుకువచ్చారు. తహసీల్దార్ వద్ద హాజరు స్వామని పోలీసులు తెలిపారు.

పావగడపై వైఎన్ హొసకోట జట్టు గెలుపు

పావగడ: వైఎన్ హొసకోట, పావగడ హోంగార్డుల జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ హోరా హోరీగా జరిగింది. ఈ పోటీలో వైఎన్ హొసకోట జట్టు విజయం సాధించింది. వైఎన్ హొసకోటలోని మైదానంలో ఇరు జట్లు శుక్రవారం తలపడ్డాయి. విజేతగా నిలిచిన వైఎన్ హొసకోట జట్టు ట్రోఫీ అందుకుంది. పావగడ జట్టుకు యూనిట్ అధికారి రాజేశ్, వైఎన్ హొసకోట జట్టుకు యూనిట్ అధికారి నందకుమార్ కెప్టెన్లుగా వ్యవహరించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదల ఆరోగ్యానికి రక్ష



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గుడిబండ: మండల పరిధిలోని ముతుకూరు గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో పాటు స్పెషలిస్టులు వెంగలరావ్, రఘునందన్, తారకేశ్వర్, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు చేపట్టారు. అనంతరం 173 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్ , సర్పంచ్ జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండల పరిధిలోని చేనేపల్లి గ్రామ శివార్లలో పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.25,100, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేయాలంటూ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చిలమత్తూరు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. విద్యార్థుల ఆందోళనకు విద్యార్థి సంఘాలు మద్దతిచ్చాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎంఈగా విశ్వనాథ్



మున్సిపల్ చైర్మన్ ఇంద్రజను కలిసిన విశ్వనాథ్

హిందూపురం: హిందూపురం మున్సిపల్ ఇంజనీర్‌గా విశ్వనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజను మర్యాద పూర్వకంగా కలిశారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని విశ్వనాథ్ తెలిపారు.

చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి

అగళి: స్థానిక పోలీసుస్టేషన్‌ను సీఐ రాజుకుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని బ్యాడిగెరె వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. చెక్ పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.



హిందూపురం అర్బన్: ఇక్కడ కనిపిస్తున్న మహిళ పేరు నంజమ్మ. ఈమెది లేపాక్షి మండలం కల్లూరు. ఆరేళ్ల క్రితం ఈమె భర్త చనిపోయాడు. పూరి గుడిసెలో జీవనం సాగిస్తున్న నంజమ్మకు నా అన్న వాళ్లు కూడా ఎవరూ లేరు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వితంతు పింఛనే ఈమెకు ఆదరవుగా నిలిచింది. ఒకటవ తేదీనే ఠంచన్‌గా అందుతున్న రూ.3 వేల పింఛన్‌లో రూ.1500 గ్రామస్తులకు ఇస్తోంది. దీంతో ఆమెకు రెండు పూటలా భోజనం పెడుతున్నారు. మిగిలిన 1500 ఆస్పత్రి ఖర్చులు, ఇంటి అవసరాలకు ఉపయోగ పడుతున్నాయని నంజమ్మ చెబుతోంది. తనకు నా అన్న వాళ్లు ఎవరూ లేకపోయినా పెద్ద కొడుకులా వైఎస్ జగన్ అండగా నిలిచారని, ఇంతకన్నా ఏం కావాలని హర్షం వ్యక్తం చేస్తోంది.



పరిగి: ఇక్కడ కనిపిస్తున్న వ్యక్తి పేరు గంగప్ప. వీరిది పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లి. గంగప్ప కూలి పనులు చేసుకుంటూ భార్య, పిల్లలను పోషించుకునేవాడు. గత ఏడాదిలో గంగప్పకు అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. నాటి నుంచి అతని కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛనే ఆదుకుంటోంది. పింఛన్ లేకపోయిఉంటే తమ పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉండేదని, జగనన్న ప్రభుత్వమే తనను ఆదుకుంటోందని గంగప్ప సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సోమందేపల్లి: ఇక్కడ కనిపిస్తున్న వ్యక్తి పేరు లాల్ అహ్మద్. సోమందేపల్లి మండలంలోని పత్తికుంటపల్లి. ఈయనకు రెండు కాళ్లు పనిచేయడం లేదు. చిన్నపాటి మెకానిక్ షాపు పెట్టుకున్నాడు. కుటుంబ పోషణ భారంగా ఉన్న సమయంలో గ్రామ సచివాలయంలో వికలాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసున్నారు. వెంటనే మంజూరు కావడంతో ఇప్పుడు ప్రతి నెలా రూ.3 వేలు తీసుకుంటున్నాడు. పింఛన్ డబ్బుతో తమ జీవనానికి ఏమాత్రం ఢోకా లేకుండా పోయిందని లాల్ అహ్మద్ చెబుతున్నారు.

అభాగ్యులకు అండ

- పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్న వైఎస్సార్ పింఛన్ కానుక
- ఠంచన్‌గా డబ్బు అందుతుండటంతో లబ్ధిదారుల హర్షం
- మళ్లీ జగనన్నకే మద్దతిస్తామంటున్న వైనం

భర్తను కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్న వితంతువులు ... దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ బతుకెలా ఈడ్చాలో తెలీని బాధితులు.. నా అన్న వాళ్లు ఎవరూ లేక వయసైపోయి అవస్థపడుతున్న వృద్ధులు... కాళ్లు, చేతులు సరిగ్గా లేక నానా ఇబ్బందులు పడుతున్న దివ్యాంగులు. ఇలా ఎంతో మంది అభాగ్యులకు నేనున్నానంటూ భరోసా ఇస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అర్హులైన వారందరికీ 1వ తేదీనే వైఎస్సార్ పింఛన్ కానుకను అందిస్తూ వాళ్ల పాలిట దైవంగా నిలిచారు.



పెనుకొండ: ఇక్కడ వలంటీర్ గాయత్రి ద్వారా పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగురాలి పేరు గిరిజ. రొద్దం గ్రామం. ఈమె అత్యంత నిరుపేద కుటుంబానికి చెందినది. దివ్యాంగురాలు కావడంతో ఏ పనిచేయడం లేదు. భర్తకు వచ్చే అరకొర కూలీ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటోంది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న రూ. 3000 పింఛన్ వారి కుటుంబానికి భరోసా ఇస్తోంది. ఒక అన్నలా సీఎం జగన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ ఇస్తూ మా కుటుంబాన్ని ఆదుకుంటోందని గిరిజ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అమరాపురం: ఇక్కడ కనిపిస్తున్న పింఛన్ తీసుకుంటున్న వితంతువు పేరు చిత్తమ్మ. అమరాపురం మండలం తమ్మడేపల్లి. ఈమె భర్త మృతి చెంది మూడేళ్లైంది. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే వితంతు పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ ఠంచనుగా వస్తుండటంతో జీవనానికి ఏ ఇబ్బంది లేదని చితమ్మ చెబుతున్నారు. జగనన్నను మరోసారి ఆశీర్వదిస్తామంటున్నారు.



చిలమత్తూరు: మంచంలోనే పడుకొని పింఛన్ అందుకుంటున్న వృద్ధుడి పేరు గంగరాజప్ప, చిలమత్తూరు మండలం భూపసముద్రం. గత కొన్నేళ్లుగా అనారోగ్యం కారణంగా మంచాన పడ్డాడు. దీంతో ఆయనకు ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలు అందిస్తోంది. పేద కుటుంబం కావడంతో పింఛన్ సొమ్ముతో జీవనం సాగిస్తున్నారు. పెద్ద కొడుకులా తమ కుటుంబానికి జగన్ అండగా ఉన్నారని గంగరాజప్ప చెబుతున్నారు.



హిందూపురం అర్బన్: ఇక్కడ పింఛన్ తీసుకుంటున్న 90 ఏళ్ల వృద్ధురాలి పేరు బయ్యమ్మ. వీరిది లేపాక్షి. కదల్లేక ఇంటి వద్దే ఉంటూ కాలం వెళ్లదీస్తోంది. కొడుకు, మనవళ్లు సపర్యలు చేస్తుంటారు. కనీసం చిన్న పనులు కూడా చేసుకొనేందుకు మరొకరిపై ఆధార పడాల్సిన పరిస్థితి. పేద కుటుంబం కావడంతో గతంలో మందులు, ఇతర ఖర్చులకు ఇబ్బంది ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3 వేల పింఛన్ వస్తుండటంతో ఇప్పుడు తనకు ఏకష్టం లేదని బయమ్మ చెబుతున్నారు.





చిలమత్తూరు: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన నరసమ్మకు 80 ఏళ్లు. పేద కుటుంబం కావడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉండేది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ పింఛన్ ఆమె ఆస్పత్రి, ఇతర ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. రూ.3 వేలు పింఛన్ ఇస్తుండటతో ఇబ్బంది లేకుండా జీవితం గడచిపోతోందని నరసమ్మ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో నరకం చూశాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఠంచనుగా ఒకటో తేదీనే పింఛన్ ఇస్తూ మాలాంటోళ్లకు అండగా నిలబడుతోంది. గతంలో పింఛన్ తీసుకోవాలంటే నరకం చూసే వాళ్లం. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే పేదలకు మంచి జరుగుతుంది.

– ఆదెమ్మ, వృద్ధురాలు, మునిమడుగు, పెనుకొండ మండలం

జగనన్న మేలు మరువం



గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా పింఛన్ తీసుకోవాలంటే పనులు వదలి గ్రామంలో గంటలు తరబడి నిరీక్షించే వాళ్లం. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీరే ఇంటికి వచ్చి డోరు తట్టి పింఛన్ డబ్బు రూ.3 వేలు ఇస్తున్నారు. పింఛన్ దార్లకు జగనన్న దేవుడు లాంటివారు. జీవితాంతం ఆయన మేలును మరువము.

– సన్ననాగప్ప, కరిదాసనపల్లి, అగళి మండలం

ఇప్పుడు ఏ ఇబ్బందీ లేదు



గతంలో పింఛన్ తీసుకునేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. ఆ రోజు సెక్రటరీ ఇస్తే డబ్బులు తీసుకోవాలి. లేదంటే రెండు మూడు రోజులు ఆగాల్సి ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా 1వ తేదీనే తెల్లవారుజామునే పింఛన్ అందిస్తోంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా నాలుగున్నరేళ్లుగా ఇంటి వద్దే పింఛన్ ఇస్తున్నారు. మా వృద్ధులను ఈ ప్రభుత్వం చాలా బాగా చూసుకోంటోంది.

– నరసమ్మ, మణూరు, మడకశిర మండలం

టీడీపీ అయినా పింఛన్ ఇస్తున్నారు



నేను టీడీపీ కార్యకర్త అయినప్పటికీ నాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చర్మకళాకారుల పింఛన్ అందిస్తున్నారు. పార్టీలకు అతీతంగా ఏ ఒక్కరి సిఫార్సు లేకుండా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే సంక్షేమ పథకాలు కూడా అందజేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తారీఖునే ప్రభుత్వ ఉద్యోగుల్లా మాకు డోర్ కొటి వలంటీర్ పింఛన్ డబ్బు ఇస్తున్నారు.

– సూరప్ప, ఈదుళ బలాపురం, సోమందేపల్లి మండలం

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సహకరించండి

- ఆర్యవైశ్యులతో మంత్రి ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: 'త్వరలోనే జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు మండలంలోని ఆర్యవైశ్యులు సహకరించండి.. పార్టీపరంగా అన్నివిధాలా అండగా ఉంటాం' అని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. స్థానిక వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆర్యవైశ్యులతో శుక్రవారం రాత్రి 'ఆత్మీయ పలకరింపు' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు బాలరాం గుప్తా , శ్రీనాథ, విష్ణు, రాజశేఖర్, నందగోపాల్, ప్రసాద్ గుప్తా, వెంకటేశ్, మురళి, మంజునాథగుప్తా, జెడ్పీటీసీ జయరాంనాయక్, గోరంట్ల సర్పంచ్ భర్త నాగేనాయక్, నార్సింపల్లి మాజీ సర్పంచ్ శివారెడ్డి, కళ్యాణదుర్గం ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి జగనన్న పెద్దపీట



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తోందని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్. దీపిక అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో హిందూపురం మండలం నింకంపల్లికి చెందిన అబ్దుల్‌రషీద్ స్పైనల్ సర్జరీకు అవసరమైన రూ.లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గిరి, శ్రీరాంరెడ్డి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు



తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా పట్టా తీసుకుంటున్న శంకర్‌నారాయణ, చక్రవర్తి

మడకశిర: తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా శంకరనారాయణ, చక్రవర్తి పట్టాలు అందుకున్నారు. మండలంలోని చందకచర్లకు చెందిన సదానందం, పద్మావతి దంపతుల కుమారులు శంకర్‌నారాయణ, చక్రవర్తి. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవంలో మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాలను తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చేతుల మీదుగా అందుకున్నారు. శంకర్‌నారాయణ శ్రీశైలం మండలంలోని చెంచుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు – ఒక పరిశీలన అనే అంశంపై పరిశోధన చేశారు. అలాగే చక్రవర్తి కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం–ఒక పరిశీలన అనే అంశంపై పరిశోధన చేశారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



హిందూపురం: నోటీస్ బోర్డులో నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షకు ఒక నిమిషం ఆలస్యమైన విద్యార్థులను అనుమతించరనే నిబంధన ఉండడంతో విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పట్టణంలో మొత్తం 9 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించారు.

గోరంట్ల: మండలంలోని ఎస్ఏపీఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తొలి పరీక్ష నిర్వహించారు. తొలిరోజు 272 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 12 మంది గైర్హాజరైనట్లు ఎస్ఏపీఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్యనాయణ తెలిపారు.

అగళి: స్థానిక ఆదర్శ పాఠశాలల్లో శుక్రవారం ఇంటర్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. రొళ్ల, అగళి మండల నుంచి 163 మంది విద్యార్థులు పరీక్షలను రాయాల్సి ఉండగా ఆరు మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్ మహమ్మద్ జాఫర్ తెలిపారు. ఒకేషనల్ జనరల్ ఫౌండేషన్ కోర్సు నుంచి 24 మందికి 24 మంది హజరైనట్లు చెప్పారు.

చిలమత్తూరు: మండల కేంద్రం సమీపంలోని బైరేకుంట వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 361 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 349 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, 12 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు.

రొద్దం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 101 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని ప్రిన్సిపాల్ విజయలక్ష్మిబాయి చెప్పారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



పెద్దపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను గడప వద్దకే అందిస్తున్న సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి, రేకులకుంట, ఆర్ ఆనంతపురం, తురుకువాండ్లపల్లి, గౌడనహళ్ళి గ్రామాల్లో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులతో కలిసి ఈరలక్కప్ప ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మవద్దని, అధికారం కోసం చంద్రబాబు ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. బాబు ష్యూరిటీ – భవిష్యత్‌కు గ్యారంటీ అంతా ఓ బూటకమన్నారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి వాగేష్, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ల నాగరాజుగౌడ్, శాలిని, జెడ్పీటీసీలు సరోజమ్మ, భూతరాజు, వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, కన్వీనర్ల పుట్టకామప్ప, స్టూడియో శ్రీనివాస్, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు బాబిరెడ్డి, సర్పంచులు కరియన్న, పుట్టమ్మ, ప్రభావతిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గోరంట్ల: మండల పరిధిలోని శివప్పల్లి, గౌనివారిపల్లి, కమ్మలవాండ్లపల్లి, కందాపురం, చలమయ్యగారిపల్లి, జక్కసముద్రం, వానవోలు లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అక్బల్‌బాషా శుక్రవారం పరిశీలించారు.



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: పరిగి మండలంలోని మోదా, కొడిగెనహళ్లి, పరిగి మండల కేంద్రంలో 250 టీడీపీ కుటుంబాలు శుక్రవారం మంత్రి , వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. పరిగిలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మంత్రి సూచించారు.

పేదల పార్టీని ఆదరించండి



కసిరెడ్డిపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: మండల పరిధిలోని కసిరెడ్డిపల్లి, తిప్పారాజుపల్లి, జీనంవాండ్లపల్లి సమీపంలోని జగనన్న కాలనీల్లో శుక్రవారం మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సరోజబాయి నేతృత్వంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌పీపీని మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



మొతుకుపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులతో గుడ్డంపల్లి వేణురెడ్డి

హిందూపురం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులందరూ ఐక్యంగా కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. పట్టణంలోని 21వ వార్డు మోతుకుపల్లిలో 'కలుద్దాం కలుపుకుని పోదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇళ్లకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి సుఖదుఃఖాలను పంచుకున్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయండి

అమరాపురం: నూతన ఆరోగ్యశ్రీ కార్డులను సత్వరమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని జిల్లా గ్రామ సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మునిస్వామి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి పలు సూచనలు, సలహాలిచ్చారు.

